ఢిల్లీలో భారీ పేలుడు..హైదరాబాద్‌లో అలర్ట్..!

హైదరాబాద్ నవంబరు10, ప్రభాతవార్త

దేశ రాజధాని ఢిల్లీలో భారీ పేలుడు యావత్ భారతాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో పోలీసులు అలర్ట్ అయ్యారు. కేంద్ర ప్రభు త్వం సైతం హై అలర్ట్ ప్రకటించడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎక్కడికక్కడ చెకింగ్స్ చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పాతబస్తీతో పాటు హైదరాబాద్‌లోని సమస్యాత్మక ప్రాంతాల పై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. దీంతో హైదరా బాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిల్లో భద్రతా బలగాలు అప్రమతనతం అయ్యాయి.

హైదరాబాద్ వార్త

నేడే పోలింగ్

- వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళి పర్యవేక్షణ
- డ్రోన్లను ఆవిష్కరించిన అధికారులు
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద సిఆర్‌పిఎఫ్ బలగాలు

జూబ్లీహిల్స్, నవంబరు 10, ప్రభాతవార్తః జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 11న జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికలు జరుగనున్నాయి. ఇందుకు సంబంధించి ఎన్నికల అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లను చేశారు. ఈవీఎం యంత్రాలను పోలింగ్ కేంద్రాలకు సోమవారం సాయంత్రం పోలీసుల బందోబస్తు మధ్య తరలించారు. ఈ ఏర్పాట్లను ఎన్నికల కమిషనర్ ఆర్.వి.కర్ణన్ పర్యవేక్షించారు. మరోవైపు పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ ఇప్పటికే అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణతోపాటు సీసీ కెమెరాల ఏర్పాటు, సమస్మాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాల మొహరింపు చేపడుతుంది. దీనికితోడు ఆర్మ్‌డ్ రిజర్వ్ బృందాలను సైతం ఇప్పటికే రంగంలోకి దించారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. డ్రోన్ల పనితీరును సైతం సోమవారం సాయంత్రం కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, పోలీసు శాఖ సంయుక్త కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ పర్యవేక్షించారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో సమస్యలు ఉండటంతో అక్కడికి వెళ్తున్న సిబ్బంది కొంత ఇబ్బందులు పడుతున్నారు. ఒక పోలింగ్ కేంద్రంలో తాగునీరు లేకపోవడం, బాత్‌రూంలకు తాళాలు ఉన్నట్లు ఎన్నికల విధులకు వచ్చిన సిబ్బంది గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. పోలింగ్ కేంద్రాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు అవసరమైన చర్యలను చేపట్టారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్యను గమనిస్తే ఇలా ఉంది.

మొత్తం ఓటర్ల సంఖ్యః 4,01,365 పురుషులుః 2,08,561 మహిళలుః 1,92,779 ఇతరులుః 25 పోలింగ్ కేంద్రాలుః 139 పోలింగ్ బూత్‌లు ః 407

ప్రత్యేక నిఘా..

పోలింగ్ నేపథ్యంలో ఎన్నికల అధికారులు, పోలీసులు ఇప్పటికే అసవరమైన అన్ని చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితులను పర్యవేక్షించా రు. పోలింగ్ కేం ద్రాల పక్కన ఉన్న రాజకీయ పార్టీల కార్యాలయాలను మూసివేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేశారు. మరోవైపు నియోజకవర్గం పరిధిలో దాదాపు 318 మంది రౌడీషీటర్లను బైండోవర్ చేశారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ తండ్రి చిన్న శ్రీశైలం యాదవ్ సైతం ఉన్నారు. అంతేకాకుండా ని యోజకవర్గ పరిధిలోని పోలిస్ ఠాణాల్లో ఉన్న లైసెన్స్‌డ్ తుపా లకును సైతం పోలీసులకు అప్పగించారు. 68 సమస్యాత్మక పో లింగ్ కేంద్రాల వద్ద సీఆర్‌పీఎఫ్ బలగాలతో ప్రత్యేక నిఘాను ఏ ర్పాటుచేశారు. వీరితోపాటు ఫ్లైయింగ్ స్క్వాడ్, క్విక్ యాక్షన్ బృం దాలను సైతం సిద్ధంగా ఉంచారు. నియోజకవర్గం పరిధిలో ఎన్ని కల అధికారులు తీసుకున్న చర్యలు ఇలా ఉన్నాయి. ఎలాంటి సమ స్యలు ఎదురైనా 1950 నంబరుకు ఫోన్ చేయాలని ముఖ్య ఎన్ని కల అధికారి సుదర్శన్‌రెడ్డి సూచించారు. వెబ్ కాస్టింగ్ ద్వారా పో లింగ్ సరళిని ఎప్పటికప్పుడు తెలుసుకొనేందుకు అధికారులు సన్నాహాలు చేశారు.

సమస్యాత్మక ప్రాంతాలుః 65

పోలిసు సిబ్బంది 1600,సివిల్ పోలీసులు 1300,ఆర్మ్‌డ్ బలగాలు 300,అదనపు బలగాలు 8 కంపెనీలు,ఫ్లైయింగ్ స్క్వాడ్స్ 15,చెక్‌పోస్టులు 15,రూట్ మొబైల్స్ 38,స్ట్రైకింగ్ బృందాలు 08, క్విక్ రియాక్షన్ బృందాలు 08, బైండోవర్ 318,లైసెన్స్‌డ్ తుపాకులు 341,డిపాజిట్ 316,మినహాయింపు 25

అభ్యర్థులు వీరు..

డ్రోన్లను ఎగురవేస్తున్న కర్ణన్, ఇక్బాల్ తదితరులు

పోలింగ్ కేంద్రం వద్ద సాయుధ పహారా

జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల బరిలో మొత్తం 58 మంది అభ్యర్థులు ఉన్నారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ నుంచి వల్లాల నవీన్‌యాదవ్, బీఆర్ఎస్ నుంచి మాగంటి సునీతాగోపీనాథ్, బీజేపీ నుంచి లంకల దీపక్‌రెడ్డిలు ఉన్నారు. వీరితోపాటు స్వతంత్రులు ఉన్నారు. మొత్తం 58 మంది అభ్యర్థులు కావడంతో దాదాపు నాలుగు ఈవీఎం యంత్రాలను పోలింగ్ కేంద్రాలలో వినియోగించే అవకాశం ఉంది. ఈవీఎంలలో ఈ సారి అభ్యర్థుల ఫొటోలను సైతం ఏర్పాటుచేశారు. తద్వారా గుర్తుల ద్వారా ఉత్పన్నమయ్యే సమస్యను ఎన్నికల అధికారులు నివారించారు.

ఓటింగ్ శాతం పెరిగేనా?

-గత ఎన్నికల్లో 50శాతం కంటే తక్కువే నమోదు

-ఈసారి 65 నుంచి 70శాతానికి పెరిగే అవకాశం

హైదరాబాద్, నవంబర్ 10,ప్రభాతవార్త: రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలతో పోలిస్తే నగరంలోని నియోజకవర్గాల్లో ఎప్పుడూ ఓటింగ్ శాతం తక్కువగానే నమోదవుతూ ఉంటుంది. అయితే, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఈ సీన్ రిపీట్ కాకుండా ఉండేందుకు ఎన్నికల అధికారులు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశారు. 2023 సాధారణ ఎన్నికల్లో ఇక్కడ 48.42 శాతం పోలింగ్ నమోదైంది. అర్బన్ ప్రాంతాల్లోని కొన్ని నియోజకవర్గాల్లో తక్కువ పోలింగ్ శాతం నమోదవడం సాధారణమే అయినా..జూబ్లీహిల్స్లో మరీ 50 శాతాని కంటే తక్కువ నమోదవడం ఆశ్చర్యపరిచింది. దీంతో ఈసారి ఓటర్లు పెద్ద సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు ప్లాన్ చేశారు. అందుకు బస్తీలు,కాలనీలల్లో ముమ్మరంగా అవగాహాన కల్పించారు. సాధారణ ఎన్నికలతో పోలిస్తే గతేడాది కంటోన్మెంట్ లో జరిగిన ఉప ఎన్నికలో 3 శాతం వరకు పోలింగ్ పెరిగింది. అయితే, అప్పట్లో పార్లమెంట్ తో పాటు బై పోల్ జరగడంతో మూడు శాతమే పెరిగిందని, ఇప్పుడు జూబ్లీహిల్స్ ఎన్నికలు మాత్రమే ఉండడంతో పూర్తి స్థాయిలో దృష్టి పెట్టి ఓటింగ్ శాతం పెంచేలా కృషి చేస్తున్నామన్నారు.

ఒక్కఓటే కదా అనుకుంటే పొరపాటే..

నా ఒక్కఓటే కదా..వేస్తే ఎంత వేయకుంటే ఎంతననేవారివల్లే ఇదంతా..భవిష్యత్తును నిర్దేశించే ఓటునే అపహాస్యం చేస్తే తదుపరి నష్టమెవరికీ గ్రామీణ ప్రాంతాల్లో కిలోమీటర్ల కొద్దీ నడిచి ఓటేసే వారెందరో..కానీ మహానగరంలో సకల సౌకర్యాలు ఉన్నాయి. పోలింగ్ కేంద్రం తెలియకపోయినా గూగుల్‌లో వెతికిపట్టుకునే పరిజ్ఞానం ఉంది. అలాంటప్పుడు ఓటుకెందుకు దూరంగా ఉండాలి. గతంలో ఒక్కఓటుతో ఓడిన ప్రజాప్రతినిధులు ఎందరో ..కార్పొరేటర్ ఎన్నికల్లోనూ ఒక్కఓటు ఎంతోకీలక భూమిక పోషించింది.

జూబ్లీహిల్స్‌లో పోలింగ్ సరళి ఇలా..

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో 2009లో జరిగిన ఎన్నికల్లో 52.77 శాతం పోలింగ్ నమోదైంది. అప్పుడు ఓటర్లు 2,59,416 మంది ఉండగా, 1,36,893 ఓట్లు పోలయ్యాయి. 2014 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఓటర్లు 3,29,522 మంది ఉండగా, 1,65,368 ఓట్లు పోలయ్యాయి. 50.18 శాతం పోలింగ్ నమోదైంది. అయితే, 2018 ఎన్నికల్లో ఒక్కసారిగా 45.59 శాతానికి తగ్గింది. ఆ ఎన్నికలప్పుడు 3,41,537 ఓటర్లుండగా, 1,55,729 ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే 2023 సాధారణ ఎన్నికల్లో ఇక్కడ 48.42 శాతం పోలింగ్ నమోదైంది. అయితే ఈసారి జరిగే ఉప ఎన్నికల్లో దాదాపు 65నుంచి 70శాతంకు పోలింగ్ పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలుపుతున్నారు.

అహ్లాదకరంగా "తమ్మిడికుంట"



హైడ్రా ఆధ్వర్యంలో పునరుద్ధరణ పనులు పరిశీలించిన కమిషర్ రంగనాథ్

తుమ్మిడికుంట పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్, నవంబర్ 10, ప్రభాతవార్త: ఐటీ కారిడార్.. మాధాపూర్‌లో మరో ఆకర్షణ ప్రజలకు అందుబాటులోకి రానుంది. మురుగు నీటిని.. దుర్గంధాన్ని వదిలించుకుని సహజ సరస్సుగా తమ్మిడికుంట రూపొందుతోంది. ముళ్లపొదలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, మీటర్ల మేర పేరుకుపోయిన పూడికను తొలగించి చెరువుకు సహజత్వాన్ని హైడ్రా అందించింది. చెరువులో ఆక్రమణలతో పాటు.. పూడికను తొలగించి విస్తీర్ణం పెంచడంతో ఇప్పుడా పరిసరాలు ఎంతో విశాలంగా మారాయి. శిల్పారామం వైపు ప్రధాన ప్రవేశ మార్గంతో నయనమనోహరంగా మారుతోంది. ఈ అభివృద్ధి పనులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ సోమవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. చెరువు చుట్టూ పటిష్టమైన బండ్ నిర్మాణంతో పాటు..ఇన్‌లెట్లు, ఔట్‌లెట్ల నిర్మాణ పనులు జరుగుతున్న తీరును తనిఖీ చేశారు. ఐటీ కారిడార్లో ఉన్న ఈ చెరువును ఓ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలను అధికారులను ఆదేశించారు. శిల్పారామం వద్ద వరద నీరు నిలవకుండా ఇన్లెట్లను అభివృద్ధి చేయాలని సూచించారు. 14 ఎకరాల చెరువును 29 ఎకరాలకు విస్తరించడం జరిగిందని.. అదే విస్తీర్ణంలో నీరు నిలిచేలా చెరువు అభివృద్ధి చేయాలని సూచించారు.

సందర్శకులు సేదదీరేలా..

దేశం నలుమూలల నుంచి వచ్చిన ఐటీ నిపుణులు నడియాడే ప్రాంతం ఇది. అత్యధిక జనసాంద్రత ఉన్న ప్రాంతం కూడా ఇదే.. ఇలాంటి చోట ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడాలని హైడ్రా కమిషనర్ సూచించారు. తమ్మిడికుంటలో స్వచ్ఛమైన నీరు ఎంత ముఖ్యమో.. ఆ పరిసరాలు కూడా అంతే పరిశుభ్రమైన వాతావరణంలో ఉండడానికి చర్యలు తీసుకోవాలన్నారు. చెరువు చుట్టూ దాదాపు 2 కిలోమీటర్ల మేర ఉన్న బండ్‌పై ప్రాణ (ఆక్సిజన్) వాయువు అందించడంతో పాటు.. చల్లటి నీడనిచ్చే చెట్లు పెంచాలన్నారు. చెరువు ప్రధాన ప్రవేశమార్గంలో పార్కులను అభివృద్ధి చేయాలని సూచించారు. అన్ని వయసుల వారూ తమ్మిడికుంట పరిసరాలకు వచ్చి సేద దీరేవిధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. పిల్లలకు ఆటవిడుపుగా క్రీడా స్థలాలను తీర్చిదిద్దాలని వృద్ధులు కూర్చునేందుకు వీలుగా చట్టూ సిమ్మెంట్, రాతి కుర్చీలను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ఓపెన్ జిమ్‌లు, కొద్దిమంది కూర్చొని ప్రశాంతంగా మాట్లాడుకోడానికి వీలుగా గుమ్మటాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కమిషనర్ ఎన్ అశోక్ కుమార్, హైడ్రా ఏసీపీ శ్రీకాంత్ ఉన్నారు.

మూగబోయిన గొంతు

-అందెశ్రీ మరణం - దిగ్భ్రాంతిలో సాహితీ లోకం

హైదరాబాద్, నవంబరు 10 ప్రభాతవార్త: ప్రముఖ కవి, గేయ రచయిత అందెశ్రీ(64) ఆకస్మిక మరణం సాహితీ లోకాన్ని, రాజకీయ వర్గాలను, భాగ్యనగరాన్ని తీవ్ర విషాదంలో ముంచెత్తింది. బడికి వెళ్లకుండా..బలపం దిద్దకుండానే అందెశ్రీ సాహితీప్రపంచంలో అడుగుపెట్టి గొప్ప స్థాయికి చేరుకున్నారు. ముఖ్యంగా ఆయన మరణం తెలంగాణ కవితాలోకానికి తీరనిలోటుగా మారింది. ప్రకృతి, తెలంగాణ ఉద్యమం, జానపద శైలిలో అందెశ్రీ అనేక పాటలు రాశారు. వాటిలో అందెశ్రీ కలం నుండి వచ్చిన జయజయహే తెలంగాణ..రాష్ట్రీయగీతంగా గుర్తించబడింది. ఈ గీతం రూపంలో అందెశ్రీ శాశ్వతంగా తెలంగాణ సమాజం నోట నిలిచిపోతారు.ఎర్ర సముద్రం సినిమాలో మనిషి మనస్థత్వం గురించి రాసిన పాట..మాయమైపోతున్నడమ్మా మనిషన్న వాడు సైతం ఎప్పటికీ తెలుగు ప్రజలకు గుర్తుండిపోతుంది. తెలంగాణ ఉద్యమం సమయంలో వచ్చిన జై భోలో తెలంగాణ సినిమాలోని..జన జాతరలో మన గీతం అనే పాట ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసిపడేలా చేసింది. దీంతో పాటు అందెశ్రీ రాసిన ఊరు తెలంగాణ.. నా పేరు తెలంగాణ పాట సైతం ఉద్యమం సమయంలో రోమాలు నిక్కబొడిచేలా చేసినపాటగా నిలిచింది. ప్రకృతిపై ప్రేమతో అందెశ్రీ రాసిన పల్లెనీకు వందనాలమ్మా పాట పల్లెల గొప్పదనాన్ని చెప్పే విధంగా ఉంటుంది. ఈ పాటను రసమయి బాలకిషన్ పాడారు. గలగల గజ్జలబండి..ఘల్లు చూడు అంటూ తన సొంతజిల్లా ఓరుగల్లును గొప్పగా వర్ణిస్తూ అందెశ్రీ రాసిన పాట సొంతగడ్డపై తనప్రేమను చాటుకునేలా ఉంటుంది. వీటితో పాటు.. కొమ్మ చెక్కితే బొమ్మరా, ఎల్లిపోతున్నావా తల్లి, చూడు తెలంగాణ, అల్లంత దూరం చూడు, ఆడ బ్రతుకు అనే పాటలు ఎంతోమందిని కదిలించాయి.

ఉపాది కోసం నగరానికి వచ్చి...

30 సంవత్సరాల క్రితం సికింద్రాబాద్ లాలాపేట్‌కు ఆయన కుటుంభంతో వచ్చిన అందెశ్రీ రెండు చిన్న గదుల్లో అద్దెకు ఉంటూ జీవనం సాగించారు. అనాడు కొన్ని రోజులు స్థానికంగా మేస్త్రీ పని చేశాడు. ఓ హార్డ్ వేర్ షాపులో కూడా పనిచేశాడని స్థానికులు పేర్కొన్నారు. ఎంతో సాదా సీదగా రోడ్డుపై ఒక్కడే నడుచుకుంటూ వెళ్లేవాడు. ఆయన కనీసం ద్విచక్రవాహనంపై కూడా వెళ్లేవాడు కాదు. ఎప్పుడు షేరింగ్ ఆటోలో లేదా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించేవాడని స్థానికులు పేర్కొన్నారు. లాలాపేట్‌తోనే ఆయన జీవనం పెనవేసుకొని పోయింది. ఆయన భార్య ముగ్గురు అమ్మాయిలు, ఒక కుమారుడుతో జీవనం సాగించాడు.స్థానికంగా ఉండే గంగాహోటల్లో ఉదయం సాయంత్రం వేళ టీతాగుతూ హోటలకు వచ్చే వారితో ప్రేమతో మాట్లాడే వాడని ఆయన ఇప్పుడు తమ నుంచి దూరం కావడాన్ని జీర్ణించుకోలేకపోతున్నామన్నారు. ఆయన ఇక్కడ ఉన్నప్పుడే నందీ ఆవార్డు వచ్చింది. తన పదునైన గీతాలతో అగ్గి రగిలించిన అందెశ్రీ పరుగెత్తు నా పాట ప్రజల నోట అని గర్జిస్తూనే ఆమాటల్ని అక్షర సత్యం చేసుకున్న కారణజన్ముడు అందె శ్రీ అంటే అతిశయోక్తి కాదని పలువురు పేర్కొన్నారు. సహజకవి కోకిల, తెలంగాణా ఆత్మగౌరవ ప్రతీక ఎల్లన్నకు నగర ప్రజలు అశ్రునివాళులర్పించారు. కాగా ఆయన కుటుంబ సభ్యుల సూచన మేరకు ఘట్కేసర్ ఎన్ఎఫ్‌సినగర్‌లో అందెశ్రీ అంత్యక్రియలు నిర్వహించేందుకు నిర్ణయించారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయన పార్థివ దేహాన్ని కుటుంబ సభ్యులు లాలాపేటలోని అందెశ్రీ నివాసానికి తరలిరచిన అనంతరం మధ్యాహ్నం ప్రజల సందర్శనార్థం జయశంకర్ స్టేడియానికి తరలించారు. అయితే అందెశ్రీకి కడసారి నివాళులర్పించేందుకు పలువురు ప్రముఖులు లాలాపేటలోని ఆయన నివాసానికి తండోపతండాలుగా వెళ్తున్నారు. ఈ క్రమంలోనే ఘట్కేసర్ లో రేపు(మంగళవారం) జరగనున్న అందెశ్రీ అంత్యక్రియలకు సీఎం రేవంత్ రెడ్డి హాజరవుతున్నట్లు తెలిసింది.

కార్తీక సోమవారం సికింద్రాబాద్ గణేష్ ఆలయంలో దీపోత్సవం

ఉమా నాగలింగేశ్వర స్వామి దేవాలయంలో పూజలు

ఆలయ జీర్ణోధారణ వేడుకల్లో పాల్గొన్న విజయారెడ్డి.

జూబ్లీహిల్స్, నవంబరు 9, ప్రభాతవార్తః
ఖైరతాబాద్ నియోజకవర్గంలోని చింతలబస్తీలోని బోలా శంకర్ భక్తసమాజ్ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమా నాగలింగేశ్వర స్వామి దేవాలయ జీర్ణోదారణ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి, ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్ పి. విజయారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో, అక్కడ నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భక్తసమాజ్ సభ్యులతోపాటు బస్తీవాసులు పాల్గొన్నారు.

అద్భుతంగా ఆపాత మధుర గీతాల సంగీత కార్యక్రమం

డాక్టర్ కేతరాజు పూర్ణిమ కామేశ్వర రావు దంపతులను సత్కరించిన దృశ్యం

చిక్కడపల్లి నవంబర్ 10 (ప్రభాతవార్త) : ప్రముఖ ధార్మిక, సేవా సంస్థ చేయూత ఫౌండేషన్ ప్రముఖ సాంస్కృతిక సంస్థ, రాంకీ మెలోడీస్ సంయుక్త ఆధ్వర్యంలో బహుగళ స్వర నిధి, వై. స్.రామకృష్ణ నిర్వహణలో జంట నగరాల ప్రముఖ గాయనీ గాయకులచే అద్భుత ఆపాత మధుర గీతాల సంగీత కార్యక్రమం నిర్వహించారు. సోమవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గాన సభ కళా లలిత కళ వేదిక లో అంతర్జాతీయ బహుభాషా, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, ధార్మిక గ్రంథ రచయిత, సంఘసేవకులు , డాక్టర్ కేతరాజు పూర్ణిమ కామేశ్వర రావు జన్మదినోత్సవం వేడుకల సందర్భంగా ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో అతిథులుగా వంశీ సంస్థల అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు, ప్రముఖ పాత్రికేయులు గుండు వల్లీశ్వర్ , త్యాగరాయసభ అధ్యక్షులు కళా జనార్ధన మూర్తి, ప్రముఖ సివిల్ ఇంజనీర్ గడ్డమణుగు సత్యనారాయణ పాల్గొని , ముఖ్య అతిథులుగా విచ్చేసి ఈ దంపతుల నిస్వార్థ సేవా, ధార్మిక కార్యక్రమాలని ఎంతగానే ప్రశంసించారు. వై ఎస్. రామకృష్ణ బృందం గాయనీ గాయకులు శ్రీ ఘంటసాల, ఏసుదాస్, సుశీల, జానకి, ఎస్పీ బాలసుబ్రమణ్యం ఆలపించిన పాటలను గాయని గాయకులు వై.ఎస్.రామకృష్ణ, బాల కామేశ్వరరావు, శివ రామ కృష్ణ, రామసుబ్రహ్మణ్యం, వై ఎస్ రామకృష్ణ, శివరామకృష్ణ, క్రిష్ణ మోహన్, సంజయ్ ఇందరం, మధుర వీణ, రేణుక రమేష్, స్వర కల్యాణి, భారతి దేవి, జ్యోతిర్లత, రాధా రాణి అద్భుతంగా గానం చేసారు. తులసిరామ్, మోహన్ గాంధీ అద్భుతంగా వ్యాఖ్యానం అందించారు.

తెలుగునేల ప్రపంచానికిచ్చిన అద్భుతం బాపుబొమ్మ
- జెడి లక్ష్మీనారాయణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న లక్ష్మీనారాయణ, అనంతలక్ష్మి, సరసి, వెంకట్ తదితర అతిథులు

నాంపల్లి, నవంబరు 10 ప్రభాతవార్త :
ప్రపంచానికి తెలుగునేల అందించిన అపూర్వ అద్భుతం బాపు బొమ్మ అని జెడి లక్ష్మీనారాయణ అన్నారు. అక్షజ్ఞ పబ్లికేషన్స్, హాస్యానందం సంయుక్త ఆధ్వర్యంలో స్టాన్లీ కాలేజీ సౌజన్యంతో రెండురోజులపాటు నిర్వహించిన బాపూ కార్టూన్ బొమ్మల కొలువు ప్రదర్శన ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వి.వి.లక్ష్మీ నారాయణ, అనంతలక్ష్మి, రాజీవ్ కనకాల, ఎ.ఎస్.లక్ష్మి, కార్టూనిస్టులు సరసి తదితరులు పాల్గొని బాపు బొమ్మలలో అద్భుతాలని విశ్లేషించారు. అక్షజ్ఞ వెంకట్ స్వాగతోపన్యాసంలో ఇది రెండవసారి బాపు బొమ్మల ప్రదర్శన జరుపుతున్నామని తెలిపారు. డిసెంబరులో పదేళ్ల సంబరం జరుపుకుంటున్న తమ సంస్థ ఈ పదేళ్లలో వంద పుస్తకాలు ప్రచురించిందని తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ రచించిన అంతా మనమంచికే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకం యువతరానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని, అందరూ తప్పక చదవాలని సూచించారు.

జనాభా ప్రకారం 20 శాతానికి రిజర్వేషన్‌లు పెంచాలి

సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

సైఫాబాద్, నవంబరు 10 ప్రభాతవార్త:
పెరిగిన జనాభా దామాషా ప్రకారం రాష్ట్రంలో ఎస్సీలకు 20 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పిడమర్తి రవి, ఎస్సీ రిజర్వేషన్ల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పుల్జాల గెల్వయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొన్ని దశాబ్దాల నుంచి ఎస్సీలకు 15 శాతం మాత్రమే రిజర్వేషన్‌లు కొనసాగుతూ వస్తున్నాయని, ప్రస్తుతం పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్‌ల శాతాన్ని 20 శాతంకు పెంచాలని వారు కోరారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'ఎస్సీ రిజర్వేషన్ల పోరాట సమితి' ఆవిర్భావ సమావేశంలో వారు మాట్లాడారు. స్వాతంత్ర్య తరువాత ఆనేక సార్లు జనాభా లెక్కలు తీయడం జరిగిందని, 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీల జనాభా 20 శాతం ఉందని, అందువల్ల ఎస్సీల రిజర్వేషన్‌లను 20 శాతంకు పెంచాలని వారు కోరారు. అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్‌లు కల్పించిన మాదిరిగానే కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో చట్టం చేసి 20 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని, అలాగే బిసిలకు 42 శాతం, ఎస్టీలకు 12 శాతం, ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని డిసెంబరు 6వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా మోటార్ సైకిల్, కార్ల ర్యాలీలను ఎస్సీలు నిర్వహిస్తారని, ఆరోజున హెలికాప్టర్ ద్వారా అంబేద్కర్ విగ్రహంపైన పూల వర్షం కురిపిస్తామని వారు చెప్పారు. ఈ సమావేశంలో పలు ఎస్సీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తున్న మోడీ విధానాలు
-ఎస్ఎఫ్ఐ ఆలిండియా ప్రధాన కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య

ప్రసంగిస్తున్న ఎస్ఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య

చిక్కడపల్లి నవంబర్ 10 (ప్రభాతవార్త) :
దేశంలో మోదీ ప్రభుత్వం విద్యరంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పె కుట్రలు చేస్తోందని, దానికోసం జాతీయ విద్యావిధానం తీసుకుని వస్తుందని ఎస్ఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య అన్నారు. సోమవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లెనిన్ గువేరా అధ్యక్షత జరిగిన ఆహ్వాన సంఘం ఏర్పాటు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీజన్ భట్టాచార్య ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రాథమిక విద్య నుండి ఉన్నత విద్య వరకు విద్యలో మార్పులు పేరుతో అమెరికన్ విద్యవిధానం అమలు చేసేందుకు కుట్ర చేస్తున్నారని, 5 సంవత్సరాలు అవుతున్న జాతీయ విద్యావిధానం నిర్దేశించిన లక్ష్యాలు అనుగుణంగా ఇప్పటికీ బడ్జెట్ కేటాయింపులు చేయలేదని విమర్శించారు. జాతీయ విద్యావిధానం పేరుతో ఆరెస్సెస్ వ్యక్తులను విద్యారంగంలో తీసుకుని వచ్చే ప్రయత్నం చేస్తున్నారు. అంబానీ, ఆదానీలకు విద్యారంగాన్ని అప్పజేప్పే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. జాతీయ విద్యావిధానం వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామని, ఇందుకోసం జనవరిలో హైదరాబాద్ లో నేషనల్ కన్వెన్షన్ ను నిర్వహిస్తున్నామని ఈ కన్వెన్షన్ జయప్రదం చేయాలని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పి.ఎం.శ్రీ పేరుతో జాతీయ విద్యావిధానం అమలు చేయాలని చూస్తోందని తెలంగాణ రాష్ట్రం ఎన.ఈ.పి.వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రజనీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన జాతీయ విద్యావిధానం పేరుతో ఐసిడిఎస్ రద్దు చేసే కుట్రలు మానుకోవాలని తెలిపారు. హైదరాబాద్ ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అశోక్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో జనవరిలో3 రోజుల పాటు కన్వెన్షన్ నిర్వహిస్తామని ఈ కన్వెన్షన్ కోసం సహకరించాలని కోరారు. అనంతరం ఆహ్వానసంఘాన్ని ప్రకటించారు.ఆ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కేంద్రకమిటి సభ్యులు ఎం.మమత,రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.కిరణ్, రాష్ట్ర కమిటీ రమ్య, జె.రమేష్,హైదరాబాద్ జిల్లా నాయకులు నాగేందర్, శ్రీమాన్, విఘ్నేష్, రజనీకాంత్, ప్రవీణ్, ఆంజనేయులు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరు 10న 'హాలో ఓబిసి-ఛలో ఢిల్లీ' : ఎంపి ఆర్.కృష్ణయ్య

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

సైఫాబాద్, నవంబరు 10 ప్రభాతవార్త: చట్ట సభలలో బిసిలకు 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేస్తూ డిసెంబరు 10న 'హాలో ఓబిసి-ఛలో ఢిల్లీ' పేరిట జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చెప్పారు. ఈ సదస్సుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒరిస్సా రాష్ట్రాల నుంచే కాకుండా ఉత్తరాది రాష్ట్రాల నుంచి ఆనేక మంది ప్రొఫెసర్లు, మేధావులు, కేంద్ర మంత్రులు, 20 మంది వివిధ పార్టీలకు చెందిన పార్లమెంట్ సభ్యులు పాల్గొంటారని తెలిపారు. 9 బిసి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశానికి సంఘం జాతీయ కార్యదర్శి బాణాల అజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తొలిసారిగా జనగణనలో కులగణన చేపడుతున్నదని ఇది దేశచరిత్రలో రికార్డు అని, 78 సంవత్సరాల స్వాతంత్ర్య చరిత్రలో ఏపార్టీ కులగణన చేయలేదన్నారు. కులగణన తరువాత బిసిలకు అన్ని రంగాలలో ముఖ్యంగా విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలలో జనాభా ప్రకారం వాటా లభిస్తుందని, అన్ని కోణలలో కులగణన తరువాత సమాజంలో విప్లవాత్మకమైన మార్పు వస్తుందన్నారు. 75 కోట్లకు పైగా ఉన్న బిసిలకు చిరకాల కోరిక అయిన కులగణన డిమాండ్‌ను కేంద్రం గౌరవించినట్లుగా ఉందని, 1931లో బ్రిటిష్ ప్రభుత్వం తీసిన లెక్కల తరువాత పిఎం నరేంద్రమోదీ ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయిం తీసుకుందని కొనియాడారు. కులగణన తరువాత బిసిలకు చట్ట సభలలో 50 రిజర్వేషన్‌లు, కేంద్రంలో బిసిలకు ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖ జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్‌ల పెంపు వంటి నిర్ణయాలను తీసుకుంటారని ఆయన అశాభావం వ్యక్తం చేశారు. బిసిల అశలకు, ఆశయాలకు ఇతర డిమాండ్లకు అనుగుణంగా ప్రధాని మోదీ నిర్ణయాలు తీసుకోవడం పట్ల ఆర్.కృష్ణయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బిసి నాయకులు నీల వెంకటేశ్, సి.రాజేందర్, అనంతయ్య, రాజ్‌కుమార్, పగిళ్ళ సతీష్, మోదీ రాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల, చిన్నారుల భద్రత విషయంలో రాజీపడేదే లేదు : సీపీ సజ్జనార్

మహిళా భద్రతా విభాగం పనితీరుపై జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీపీ సజ్జనార్, చిత్రంలో అదనపు సీపీ శ్రీనివాస్,డీసీపీ లావణ్య నాయక్ ఉన్నారు

హైదరాబాద్, నవంబరు 10 ప్రభాతవార్త
చిన్నారుల భద్రత విషయంలో రాజీపడేదే లేదని నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ స్పష్టం చేశారు. మహిళల భద్రత, రక్షణ అనేది సామాజిక బాధ్యత అని ఆయన గుర్తుచేశారు.బంజారాహిల్స్‌లోని ఐసీసీసీ ఆడిటోరియంలో సోమవారం మహిళా భద్రత విభాగం పనితీరుపై సిపి సజ్జనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆ విభాగంలోని మహిళా పోలీస్ స్టేషన్లలో నమోదవుతున్న కేసులను ఆరా తీశారు. షీటీమ్స్, భరోసా, యాంటీ హుమన్ ట్రాఫికింగ్, జువైనల్ తదితర విభాగాల పోలీస్ అధికారులతో మాట్లాడి వారి పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహిళా భద్రత విషయంలో వ్యవహరించాల్సిన తీరుపై దిశానిర్దేశం చేశారు. మహిళలు బాధతో పోలీస్ స్టేషన్లకు వస్తారని, వారితో మానవత దృక్పథం వ్యవహరించాలని సూచించారు. అన్యాయం జరిగిందని వచ్చే బాధిత మహిళకు తాము అండగా ఉన్నామనే భరోసా కల్పించాలన్నారు. కేవలం కేసులు నమోదు చేసి వదిలేయొద్దని, సమగ్రంగా దర్యాప్తు చేయాలన్నారు. పోక్సో, అత్యాచార కేసుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళా భద్రతపై అవగాహన కల్పించాలని, చిన్నపిల్లలకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్, స్వీయరక్షణ విషయాలు నేర్పాలని సూచించారు. ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ అప్పుడే కాకుండా మిగతా సమయాల్లోనూ వీధి బాలలు, వెట్టిచాకిరి, పరిశ్రమల్లో మగ్గుతున్న బాలకార్మికులను రక్షించాలని ఆదేశించారు. ఆడపిల్లల జోలికి వస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, నిందితులపై హిస్టరీ షీట్స్ తెరుస్తామని హెచ్చరించారు. వారికి పాస్‌పోర్ట్ మంజూరు కాదని, ప్రభుత్వ ఉద్యోగాలు రావని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు సీపీ(క్రైమ్స్) శ్రీనివాస్,డీసీపీ (మహిళా భద్రత) లావణ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల్లో చోరీలకు పాల్పడుతున్న అంతఃరాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న సౌత్ జోన్ డిసిపి స్నేహ మెహ్రా

సైదాబాద్, నవంబరు 10 ప్రభాతవార్త: దేవాలయాల్లో, దుకాణాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతఃరాష్ట్ర దొంగల ముఠాను సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు, ఐఎస్ సదన్ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సౌత్ జోన్ డిసిపి స్నేహ మెహ్రా దీనికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. భీమవరం చిన్నపేటకు చెందిన జువ్వల తరుణ్ కుమార్ రాజు(21), దగరపు ఇల్యారాజు(22), మరుబోయిన మావులు(19), గండ్‌రెడ్డి లోకేష్(19)లు స్నేహితులు. వీరు చిన్ననాటి నుంచే దొంగతనాలకు పాల్పడుతున్నారు. జువ్వల తరుణ్ కుమార్ రాజుపై గతంలో 41 కేసులు, దగరపు ఇల్యారాజుపై 30 కేసులు, మరుబోయిన మావులుపై 6 కేసులు, గండ్‌రెడ్డి లోకేష్‌పై 15 కేసులు భీమవరం పరిసర ప్రాంతాల్లో ఉన్నాయి. వీరు నలుగురు చోరీ చేసిన సొత్తును భీమవరంకే చెందిన కొనల రాజి(18), సిసిఎల్ సహకారంతో విక్రయించే వారు. జువ్వల తరుణ్ కుమార్ రాజును మే నెలలో పి.గన్నవరం పోలీసులు అరెస్టు చేయగా గత నెలలో బెయిలుపై విడుదల య్యాడు. అనంతరం నిందితులంతా కలిసి చర్చించుకుని, పశ్చిమ గోదావరిలో చోరీలకు పాల్పడితే తమను పోలీసులు సులువుగా గుర్తిస్తారని, అందువల్ల హైద్రాబాద్‌లో చోరీలకు పాల్పడాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో నందిగామ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక బైక్‌ను చోరీ చేశారు. అనంతరం అయిదుగురు నిందితులు, సిసిఎల్‌తో కలిసి హైద్రాబాద్‌కు చేరుకుని నాదర్ గూల్‌లోని కమ్మగూడలో ఒక ఇంటిని అద్దెకు తీసుకున్నారు. ఈ నెల 4వ తేది అర్ధరాత్రి సమయంలో జువ్వల తరుణ్ కుమార్ రాజు, దగరపు ఇల్యారాజు, మరుబోయిన మావులు, గండ్‌రెడ్డి లోకేష్‌లు ఎల్‌బినగర్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో చోరీకి పాల్పడ్డారు. అయిదవ తేదీ రాత్రి హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరో ద్విచక్ర వాహనాన్ని దొంగిలించారు. తాము దొంగిలించిన రెండు ద్విచక్ర వాహనాలపై నిందితులు నలుగురు వరుసగా 3 దేవాలయాల్లో చోరీకి, 6 షటర్ లిఫ్టింగ్ నేరాలకు పాల్పడ్డారు. ఐఎస్ సదన్ పిఎస్ పరిధిలో రెండు, సరూర్‌నగర్ పిఎస్ పరిధిలో 3, సైదాబాద్ పిఎస్ పరిధిలో 2, బేగం బజార్ పిఎస్ పరిధిలో ఒకటి, సుల్తాన్‌బజార్ పిఎస్ పరిధిలో ఒక చోరికి పాల్పడ్డారు. అనంతరం నిందితులంతా తిరిగి భీమవరంకు వెళ్లిపోయారు. హైద్రాబాద్‌లో మరో సారి చోరీలు చేయడానికి ఈ నెల 7వ తేదీన తిరిగి నిందితులంతా హైద్రాబాద్‌కు చేరుకుని తాము గతంలో ఉన్న కమ్మగూడలోని ఇంట్లోనే అద్దెకు దిగారు. చంపాపేటలోని మూడు గుళ్ల దేవాలయం వద్ద వాహనాల తనిఖీలో నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా తాము చోరీలకు పాల్పడుతున్న విషయాన్ని అంగీకరించారు. నిందితులందరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. విలేకరుల సమావేశంలో టాస్క్ ఫోర్స్ అడిషనల్ డిసిపి అందె శ్రీనివాసరావు, సౌత్ ఈస్ట్ జోన్ అడిషనల్ డిసిపి కె.శ్రీకాంత్, సంతోష్‌నగర్ ఎసిపి సుఖదేవ్ సింగ్, సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సైదబాబు, ఐఎస్ సదన్ ఇన్‌స్పెక్టర్ జి.నాగరాజు, డిఐ ఎన్.కరుణ కుమార్, ఎస్ఐలు కె.రామారావు, ఎం.మధు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ బ్రోచర్ ఆవిష్కరణ

ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల బ్రోచరను ఆవిష్కరిస్తున్న హని భారత్ శర్మ

హైదరాబాద్ నవంబర్ 10 ప్రభాతవార్త ; ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ 2025 పోటీలు డిసెంబర్ 13, 14 తేదీల్లో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరుగనున్నాయి. ఈ పోటీల బ్రోచర్‌ను సోమవారం కరాటే ఇండియా ఆర్గనైజర్ హని భారత్ శర్మ ఆవిష్కరించారు.ఈ ఛాంపియన్ షిప్ పోటీలను సీకోకై కరాటే తెలంగాణ సంస్థ, తెలంగాణ స్పోర్ట్స్ కరాటే డో అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తోంది. వరల్డ్ కరాటే ఫెడరేషన్‌కు అనుబంధంగా కరాటే ఇండియా ఆర్గనైజేషన్ అనుమతితో ఈ పోటీలు జరుగుతున్నాయని నిర్వహాకులు తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ, కరాటే ఇండియా ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో పాటు కీర్తన్ కొండ్రు,టి. కనకరాజు, జె.ప్రవీన్ కుమార్ తదితరులు పాల్గొంటారని నిర్వహాకులు తెలిపారు.

అపూర్వ సాంస్కృతికయజ్ఞం నవ్యనాటకసమితి సంగీత నృత్యోత్సవం : డా. కె.వి.రమణాచారి

నవ్యనాటకసమితి 50వ అఖిల భారత సంగీత నృత్య పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రమణాచారి, ఫణీంద్ర, విజయకుమార్, సుధామాల, రజిత్‌కుమార్ తదితర నాట్యగురువులు

నాంపల్లి, నవంబరు 10 ప్రభాతవార్త : ప్రముఖ సాహిత్య, సాంస్కృతిక కళాసంస్థ నవ్యనాటక సమితి జాతీయస్థాయిలో సంగీత నృత్యోత్సవ పోటీలను హైదరాబాద్ నగరంలో 50ఏళ్లుగా నిర్వహిస్తున్న ఈ 9రోజుల నవదిన సంగీత నృత్యోత్సవాలు అపూర్వ సాంస్కృతిక యజ్ఞం... ఎంతో పవిత్రమైనవని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు.సోమవారం ఉదయం రెడ్‌హిల్స్ లోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో డా. కె.వి.రమణాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని నవ్యనాటకసమితి 50వ అఖిల భారత సంగీత నృత్యపోటీల గోడపత్రిక (పోస్టర్)ను సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, కార్యనిర్వాహక సంఘ సహాధ్యక్షులు ఎ.రజిత్‌కుమార్, ఆచార్య ఫణీంద్ర, సభ్యులు రాజ్‌కుమార్, డా. ఎన్.విద్యారణ్యస్వామి, సమన్వకర్త నిష్టల సుధామాల తదితరులతో కలిసి ఆవిష్కరించి ప్రసంగించారు. సమితి వ్యవస్థాపకులు వేమరాజు నరసింహారావు క్రమశిక్షణ, సమయపాలన, నిస్వార్థ సేవాగుణమున్న ఆదర్శప్రాయుడని, అందువల్లనే 67 సంవత్సరాలుగా సమితి వర్ధిల్లుతోందని అన్నారు. అనంతరం వివరాలను వెల్లడిస్తూ నవంబరు 15 నుండి 22వరకు 8రోజులపాటు నాంపల్లి లోని తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో సంగీత నృత్య పోటీలు జరుగుతాయని, 23 రాత్రి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ స్వర్ణోత్సవ సంగీత నృత్య పోటీలకు 300మందికిపైగా యువకళాకారులు కర్ణాటక, హిందూస్థానీ సంగీతం, వీణ, తబల, మృదంగం, కూచిపూడి, భరతనాట్య, ఆంధ్రనాట్యం, కథక్ తదితర సంగీత నృత్యపోటీల్లో పాల్గొనున్నట్లు వివరించారు. 15న కె.వి.రమణాచారి సభాధ్యక్షతన జరిగే కార్యక్రమానికి జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా విచ్చేసి ఈ జాతీయస్థాయి సంగీత నృత్యపోటీలో స్వర్ణోత్సవాలను లాంఛనంగా ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

గదిలో నిర్భందించి.. మూకుమ్మడి దాడి

జూబ్లీహిల్స్, నవంబరు 9, ప్రభాతవార్తః
జూబ్లీహిల్స్‌లో ఒక ఆస్తి వివాదం దాడులకు దారి తీసింది. గదిలో నిర్భందించి ఇనుపరాడ్లు, కత్తులతో దాడులకు పాల్పడ్డారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 25లో పోలవరపు శ్రీదేవి కుటుంబ సభ్యుల నుంచి బంజారాహిల్స్ రోడ్ నంబరు 12 హుడా హైట్స్‌లో నివసించే వ్యాపారవెత్త సునీల్‌కుమార్ అహుజా దాదాపు 764 చదరపు గజాల ఇంటితో కూడిన స్థలాన్ని 2009లో పోలవరపు శ్రీదేవి కుటుంబ సభ్యుల నుంచి కొనుగోలు చేశాడు. ఇందుకు సంబంధించి రూ. 5 కోట్ల రూపాయల డబ్బులను సునీల్‌కుమార్ అహుజా చెల్లించారు. అప్పటి నుంచి ఆ ఇళ్లు అహూజా ఆధీనంలోనే ఉంది. ఇంటికి సంబంధించిన విద్యుత్, మున్సిపల్ బిల్లులు అహూజా చెల్లిస్తూ వస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ నెల 9న సునీల్‌కుమార్ అహూజా కుమారుడైన ఆశిష్ కుమార్ అహూజా అతని స్నేహితుడైన ఇమ్రాన్‌తో కలిసి తన ఇంటికి వెళ్లాడు. అప్పటికే అక్కడ కొందరు గుర్తుతెలియని వ్యక్తులు అక్కడ కనిపించారు. అదే సమయంలో విధుల్లో భాగంగా అక్కడికి వచ్చిన బిగ్ టీవీ రిపోర్టర్ సాగర్ వారిని ఆస్తిపత్రాలు చూపాలని కోరారు. ఈ క్రమంలోనే పోలవరపు శ్రీదేవి ఆమె తల్లి వరలక్ష్మి మరికొంతమంది అనుచరులతో కలిసి ఆశిష్ కుమార్ అహూజా, ఇమ్రాన్‌లను బలవంతంగా గదిలో నిర్భందించారు. వారిపై ఇనుపరాడ్లు, కత్తులతో దాడికి దిగారు. తప్పించుకొనే సమయంలో ఆశిష్‌కుమార్ అహూజా తల, తొడలు, నడుము భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. వారు తప్పించుకొనే యత్నంలో ఆశిష్ కుమార్ చేతికి ఉన్న ఐవాచ్, ఐఫోన్ లాక్కొన్నారు. జూబ్లీహిల్స్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో పోలిసులు శ్రీదేవి, ఆమె తల్లి వరలక్ష్మి, బిగ్ టీవీ రిపోర్టర్ సాగర్ తదితరులపై సెక్షన్ 118(1), 126(2), 351(2), 309(4), రెడ్ విత్ 3(5) బీఎన్ఎస్ కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా అక్టోబరు 30న సైతం ఈ ఇంటి వ్యవహారంలో ఆశిష్‌కుమార్ అహూజా ఇచ్చిన ఫిర్యాదులో మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు మరో కేసును నమోదు చేశారు. తాము కొనుగోలు చేసిన ఈ ఇంటిని సంరక్షించడానికి ఏర్పాటుచేసిన సహాయకులను శ్రీదేవి కుమారుడు బెదిరించడంతోపాటు ఆస్తికి సంబంధించిన నకిలీ పత్రాలను సృష్టించినట్లు ఆశిష్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీదేవితో పాటు ఆమె కుమారుడు పలువురిపై జూబ్లీహిల్స్ పోలీసులు అదే రోజున కేసు నమోదు చేశారు.

పురాతన చెరువుల సుందరీకరణకు ప్రత్యేక చర్యలు : చార్మినార్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి

జిహెచ్ఎంసి చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి పర్యటిస్తున్న

అందెశ్రీ మృతి తెలంగాణకు తీరని లోటు

టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా

ముషీరాబాద్, నవంబర్ 10, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ సృష్టి కర్త అందెశ్రీ మృతి తెలంగాణ రాష్ట్రానికే తీరని లోటని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అందెశ్రీ మృతి పట్ల తీవ్ర విచారం, ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నామన్నారు. పేదరికం, నిరక్షరాస్యత నుండి స్వయంకృషితో ఎదిగి, సమకాలీన తెలుగు సాహితనయంలో అత్యంత ప్రతిభివంతులలో ఒకరిగా నిలిచిన అందెశ్రీ రచించిన రాష్ట్రగీతం, ఆనాడు ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిందని గుర్తు చేశారు. రైతులు, కార్మికులు, అట్టడుగు వర్గాల పోరాటాలపై ఆయన చేసిన రచనలు ఎంతోమందిని కదిలించాయని, ఆయన చేసిన సాహిత్య సేవలకు అనేక పురస్కారాలు, గౌరవ డాక్టరేట్‌లు పొందారని గుర్తు చేశారు. ఆ మహనీయుని పేరు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా ఏదైనా కళాపీఠానికి లేదా విద్యాలయానికి అందెశ్రీ పేరు పెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు నల్లెల్ల కిషోర్, బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, భానుప్రకాష్, కృష్ణస్వామి పాల్గొన్నారు.

ఘనంగా అగ్నికుల క్షత్రియ సంఘం కార్తీక వనబోజనాలు

జీడిమెట్ల, నవంబరు 10 ప్రభాతవార్త

హెచ్ఎంటి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో అగ్నికుల క్షత్రీయ సంక్షేమసంఘ కార్తీక మాస వనబోజనాలు ఆటపాటలతో ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ జిల్లా అగ్నికుల క్షత్రీయ సంకక్షేమ సంఘ అధ్యక్షులు బర్రిప్రసాద్ కార్యక్రమానికి అధ్యక్షత వహించి ఆట, పాటలతో ఆలరింపజేశారు. జంటనగరాలు, శివారు ప్రాంతాలనుండి వందలదిగా స్త్రీ, పురుషులు, పిల్లలు, యువకులు పాల్గొని ఆటపాటలతో ఆలరింపజేశారు. ముఖ్యంగా సినిమాపాటలతోపాటు వివిధ క్రీడాపోటీలను నిర్వహించి గెలుపొందిన విజేతలకు ప్రథన, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు ప్రోత్సాహక బహుమతులను అందజేసి ప్రత్యేకత చాటుకున్నారు.

కార్తీక సోమవారం అన్నసమారాధన కార్యక్రమం

అన్న సమారాధనలో పాల్గొన్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట్, నవంబర్ 10, ప్రభాతవార్త

నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్, రాజీవ్ గృహకల్ప కాలనీలోని శ్రీశ్రీశ్రీ ఉమా మహేశ్వర ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా మహా అన్నప్రసాద కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి గురు స్వామి ముఖ్య అతిథిగా పాల్గొని ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమం వారి చేతుల మీదగా ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ పితాని శ్రీనివాసరావు, రైస్ బర్డ్ న్యూట్రిషన్ నిర్వాహకులు ఆత్మకూరు ప్రవీణ్ కుమార్, భాస్కర్, అంబటి, ఎంజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముక్కర్ల లాలయ్య, రామరాజ్యం, రజకసంగం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నవ్య శ్రీనివాస్, ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు లక్ష్మణ్, రమణ, కుమార్ రెడ్డి, రామచంద్రనాయక్, బాలకృష్ణ, దాలి నాయుడు, ఆర్ రాజు, రాజు గౌడ్, ఈశ్వర్ రావు, రామకృష్ణ, శివ నాగరాజు యాదవ్, సుమతి, జయలక్ష్మి, జ్యోతి, లక్ష్మి, శైలజ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళన అవసరం : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

కాలనీ వాసులుతో ఎమ్మెల్యే

అల్వాల్, నవంబరు 10 ప్రభాతవార్త: అల్వాల్‌లో డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళన అత్యవసరమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని పంచ్‌షీల్ కాలనీలో అధికార యంత్రాంగంతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. కాలనీకి అవుట్ లెట్ లేని నేపథ్యంలో మురికి నీరు ఓ ఖాళీ ప్రదేశంలోకి చేరుతోందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సంబంధిత స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ప్రైవేటు ఆస్తులు ఉన్న నేపథ్యంలో వారితో సంప్రదించాలని అధికారులను కోరారు. అందరి అనుమతితో డ్రైనేజీ రూపకల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయాల్సి ఉంటుందని మర్రి పేర్కొన్నారు. సమస్యకు శాస్వత పరిష్కరం చూపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇఇ శ్రీకాంతి, డిఇ రఘు, ఏఇ రవళి జలమండలి డీజీఎం సాంబయ్య కాంగ్రెస్ నేతలు డోలి రమేష్, పరమేష్, శోభన్ ఇతరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తా: కార్పొరేటర్ జితేందర్‌నాథ్

వినతి పత్రం స్వీకరిస్తున్న కార్పొరేటర్

అల్వాల్, నవంబరు 10 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని మచ్చబొల్లారం కార్పొరేటర్ జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. సోమవారం డివిజన్‌కు చెందిన రాయల్ ఎన్‌క్లేవ్, బ్లూ బర్డ్స్ కాలనీ వాసులు కార్పొరేటర్‌ను కలిసి సమస్యలకు సంబంధించి వినతి పత్రం అందించారు. అపరిష్కృతంగా ఉన్న సిసి రోడ్డు పనులను చేపట్టాలని చిన్నపాటి సాంకేతిక సమస్యను బూచీగా చూపి పనులు చేయడం లేదని కాలనీ వాసులు పేర్కొన్నారు. సమస్యను త్వరలోనే పరిష్కరిస్తానని జితేందర్‌నాథ్ తెలిపారు.

మంత్రి తుమ్మలపై తప్పుడు ప్రచారం.. కేసు నమోదు

జూబ్లీహిల్స్, నవంబరు 10, ప్రభాతవార్తః మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుపై ఫేస్‌బుక్‌లో తప్పుడు ప్రచారం చేసిన ఒక ఫేస్‌బుక్ యూజర్‌పై సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వెంగళ్‌రావునగర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ తరుపున ప్రచార బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా తుమ్మల నాగేశ్వర్‌రావు బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతు పలుకుతున్నాడనంటూ ఫేస్‌బుక్‌లో పలు పోస్టులు దర్శనమిచ్చాయి. ఈ విషయాన్ని గుర్తించిన తుమ్మల నాగేశ్వర్‌రావు వద్ద పనిచేసే అనీల్‌కుమార్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు కువ్వా రమేష్ అనే వ్యక్తి తన ఫేస్‌బుక్ ఖాతా ద్వారా ఈ తప్పుడు పోస్టులు పెట్టినట్లు గుర్తించారు. ఎన్నికల సమయంలో ప్రజలను తప్పుదోవ పట్టించేలా పోస్టు పెట్టడంతో అతనిపై సెక్షన్ 336(4), 352 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్ఎంటి కాలనీలో పండగ శోభను సంతరించుకున్న కార్తీక వనభోజనాలు

జీడిమెట్ల, నవంబరు 10, ప్రభాతవార్త

కార్తీకమాస వనభోజనాలు నగర శివారు హెచ్ఎంటికాలనీలో పండగశోభను సంతరించుకున్నాయి. చింతల్ కుత్బుల్లాపూర్ ఆర్యవైశ్య సంఘఅధ్యక్షులు జూలూరు విజయ్‌కుమార్‌గుప్తాతోపాటు సంఘ కార్యవర్గ నాయకత్వంలో హెచ్ఎంటికాలనీ పెద్దమర్రిచెట్టుఆవరణలో నిర్వహించిన వనభోజనాలు శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీదేవి పూజాకార్యక్రమాలతో ప్రారంభమై పిల్లా, పెద్దలు, ఆడ, మగ, యువత కలిసి ఆట,పాటలతో సభాప్రాంగాణాన్ని ఆలరింపజేశాయి. ఈసందర్భంగా చింతల్ కుత్బుల్లాపూర్ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు జూలూరు విజయ్‌కుమార్‌గుప్తా మాట్లాడుతూ కేవలం పదినెలల పదవీకాలంలోనే ఇరవై కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహించినట్లు వివరించారు. లక్ష కుంకుమార్చన, కార్తీక వనభోజనాలు, శ్రీవాసవి మాత జయంతి ఉత్సవాలనుండి మొదలకుని రాష్ట్ర,జిల్లా కమిటీల పిలుపుమేరకు సుమారు 20 కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహించినట్లు తెలిపారు. తనలక్ష్యం, తనధ్యేయంగా చింతల్ కుత్బుల్లాపూర్ పరిధిలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీదేవి ఆలయ నిర్మాణాన్ని పూర్తిచేయాలని వివరించారు. చింతల్

ఆట, పాటలతో ఆలరిస్తున్న చింతల్ కుత్బుల్లాపూర్ ఆర్యవైశ్య వనభోజనాలు

కుత్బుల్లాపూర్ ఆర్యవైశ్య వనభోజన నిర్వాహకులు, సంఘ అధ్యక్షులు జూలూరు విజయ్‌కుమార్ గుప్త, ప్రధాన కార్యదర్శి మహాంకాళి ప్రభురాజ్‌గుప్తా, కోశాధికారి ఇల్లెందుల కృష్ణకుమార్‌గుప్తా, ఉపాధ్యక్షులు జూలూరు వీరేందర్‌గుప్తా, వి.రాజు, సలహాదారులు ఇడుకళ్ల కృష్ణమూర్తి, నీలా శివకుమార్, ముక్కా రమేశ్, పోలా రమేశ్, నేతి జగన్నాథం, ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, డీలర్ వీరేందర్, బెజగం రాజు, నారాయణ ప్రసాద్, నల్లనాగుల సంతోశ్‌కుమార్, బలసాని కిరణ్, నల్లా భద్రయ్య, మదిరె దినేష్, రశ్మరామ్ రమేశ్, వవి.ఎస్.సంతోశ్, మహాంకాళ సుధీర్‌గుప్తా, సురేశ్‌గుప్తా తదితరులు పాలల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టాపనకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం

శాంతినగర్ కాలనీలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో దేవతామూర్తుల ప్రతిష్టాపనలో పాల్గొనాలని ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి.

నార్సింగి, నవంబర్ 9 ప్రభాతవార్త :

బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ హైదర్షాకోట్‌లోని శాంతినగర్ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో లక్ష్మీగణపతి, రామలింగేశ్వర విగ్రహాల ప్రతిష్టాపన వేడుకకు రావాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి ఆహ్వానించారు. ఆలయ కమిటీ సభ్యులతో కలిసి మాజీ కార్పోరేటర్ సంతోషిరాజిరెడ్డి, రాజేందర్‌రెడ్డిలు ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాలు, శాస్త్రోక్తంగా సాగే ఈ మహిమాన్విత కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యేను కోరామన్నారు. ఇందుకు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ స్పందిస్తూ తప్పకుండా దైవ కార్యంలో పాల్గొంటానని హామీనిచ్చారని రాజేందర్‌రెడ్డి తెలిపారు.

రాష్ట్రస్థాయి నృత్య పోటీల్లో మణికొండ విద్యార్థిని ప్రతిభ

- పాఠశాలలో అభినందించిన పుర ప్రముఖులు, ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి నృత్య పోటీల్లో ప్రతిభ కనబర్చిన మణికొండ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని మహిమాన్వితను అభినందిస్తున్న రామకృష్ణారెడ్డి తదితరులు.

నార్సింగి, నవంబర్ 10 ప్రభాతవార్త : మణికొండ ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థిని మహిమాన్విత టీచ్ ఫర్ చేంజ్, పేగా సిస్టమ్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థలు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన నృత్య పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చింది. నిర్వాహకులతో పాటు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరించదన చేత శభాష్ అనిపించుకొని, ఏసర్ ల్యాప్‌టాప్‌ను బహుమతిగా పొందింది. మహిమాన్విత సాధించిన ఘనతను చూసి ఇతర విద్యార్థులు స్ఫూర్తి పొందుతారన్న ఉద్దేశంతో పాఠశాలలో ఉపాధ్యయులు, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డిలు అభినందించి, ఆశీర్వదించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరిలో ఒక్కో రకమైన ప్రతిభ దాగి ఉంటుందని, దాన్ని గుర్తించి సానబెడితే అద్భుతమైన ఫలితాలు వస్తాయన్నారు. మహిమాన్విత చదువుకుంటేనే నృత్యంను ఇష్టంగా సాధన చేసిందని, ఏకంగా రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటి మన మణికొండకు మంచి పేరు తీసుకు వచ్చిందన్నారు. ఆమె ప్రతిభ పట్ల తామంతా గర్వపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దశరథ్ నాయక్, నాయకులు బుద్దోలు శ్రీరాములు, ఏర్పుల కుమార్, శ్రవణ్ కుమార్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

11.వ జోనల్ స్థాయి పోటీల్లో సత్తా చాటిన నార్సింగి గురుకుల పాఠశాల విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయుల దృశ్యం.

ప్రజాకవి అందెశ్రీ మృతి తెలంగాణ సాహిత్య లోకానికి తీరని లోటు

తెలంగాణ అడ్వకేట్ జెఎసి కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి

ముషీరాబాద్, నవంబర్ 10, ప్రభాతవార్త: ప్రముఖ ప్రజాకవి, తెలంగాణ మట్టి బిడ్డ అందెశ్రీ మృతి యావత్ తెలంగాణ సాహిత్య లోకానికే తీరని లోటని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్, తెలంగాణ గ్రామ పంచాయితీ ట్రిబ్యునల్ మాజీ సభ్యులు పులిగారి గోవర్ధన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం అందెశ్రీ మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, అందెశ్రీ తన పాటతో తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోశారని గుర్తు చేశారు. ఆయన రచించి, ఆలపించిన మాయమౌతున్నడమ్మా మనిషన్న వాడు అనే పాట నిత్యం ప్రజల మనసుల్లో మెదులుతూనే ఉంటుందన్నారు. తెలంగాణ న్యాయవాదులుగా, తెలంగాణ ఉద్యమకారులుగా అందెశ్రీ మృతి పట్ల వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియ చేస్తున్నామన్నారు.

సందేశాత్మకం నక్షత్రరాగం కవితల సంపుటి

కవితల సంపుటిని ఆవిష్కరిస్తున్న కొలకలూరి ఇనాక్, ఆదిత్య, సత్యాజీ, నరసింహారెడ్డి, శాంతికృష్ణ, నాళేశ్వరంశంకరం తదితర అతిథులు

రవీంద్రభారతి, నవంబరు 10 ప్రభాతవార్త : ప్రముఖ రచయిత సుమన ప్రణవ్ రచించిన నక్షత్రరాగం కవితల సంపుటి ఎంతో సందేశాత్మకంగా ఉందని, చక్కటి సందేశాలను అందించాయని ఆచార్య కొలుకలూరి ఇనాక్ అన్నారు. తెలుగు సాహితీవనం ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలోని సమావేశ మందిరంలో సీనియర్ పాత్రికేయుడు సత్యాజీ సభాధ్యక్షతన జరిగిన పుస్తకాల ఆవిష్కరణలో కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కొలకలూరి ఇనాక్ నక్షత్రరాగం సంపుటిని ఆవిష్కరించి ప్రసంగించారు. విజయ్ అప్పల రచించిన అమలోద్భవిలో అర్జునుడు జానపద నవలను సినీదర్శకుడు వి.ఎన్. ఆదిత్య, విజయ్ రచించిన రెండు బాలసాహిత్య పుస్తకాలను చి.జున్ను ఆవిష్కరించారు. విశిష్ట అతిథులుగా విచ్చేసిన డా. ఏనుగు నరసింహారెడ్డి, డా. పెద్దింటి అశోక్ కుమార్, డా. నాళేశ్వరం శంకరం పుస్తకాలను సమీక్షిస్తూ మాట్లాడారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు శాంతికృష్ణ పర్యవేక్షణలో జరిగిన సభకు కంచిపాటి వెంకట్ సమన్వకర్తగా వ్యవహరించారు. సుధాకళ్యాణి వందన సమర్పణతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

బదిలీపై వెళుతున్న సీఈఓకు అభినందనలు

కంటోన్మెంట్, నవంబరు 10 ప్రభాతవార్తః

కంటోన్మెంట్ బోర్డు సీఈవోగా పనిచేసిన మధుకర్ నాయక్ న్యూఢిల్లీకి బదిలీ అవుతున్న సందర్భంగా సోమవారం బోయిన్పల్లి మార్కెట్ చైర్మన్ ఆర్ ఆనంద్ బాబు గౌడ్, వైస్ చైర్మన్ డిబి దేవేందర్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి, జంపన ప్రతాప్‌లు అభినందనలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చి మందు చేసి అభినందనలు తెలియజేశారు.

కంటోన్మెంట్లో మధుకర్ నాయక్ సేవలు మరువలేనివి

ః ముప్పిడి గోపాల్

కంటోన్మెంట్, నవంబరు 10 ప్రభాతవార్తః

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సీఈవోగా 3 సంవత్సరాల పాటు పనిచేసిన మధుకర్ నాయక్ కంటోన్మెంటుకు చేసిన సేవలు మరువలేనివని బోయినపల్లి మార్కెట్ తొలి చైర్మన్ ముప్పిడి గోపాల్ తెలిపారు పదోన్నతి పై ఢిల్లీకి బదిలీ అయిన మధుకర్ నాయకులు సోమవారం సీఈఓ ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు దర్గా రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌ఫాత్‌లు ఆక్రమించి ఇసుక,కంకర,డస్ట్ నిల్వ

-ఫతేనగర్ సబ్‌స్టేషన్ ముందు మూల మలుపులో నిత్యం ప్రమాదాలు.

-కంకర,ఇసుక,డస్ట్ తొలగించాలంటున్న స్థానికులు,వాహనదారులు

బేగంపేట నవంబరు 10,ప్రభాతవార్త

పాదచారులు నడవాల్సిన పాదబాటలు (ఫుట్‌ఫాత్)లు కొందరు దర్జాగా కబ్జా చేసారు.అంతటితో ఆగకుండా ఫుట్‌ఫాత్‌పై ఇసుక,కంకర,డస్ట్ నిల్వ చేయడంతో ఫతేనగర్ లింక్ రోడ్డు విద్యుత్ సబ్ స్టేషన్ ముందు ఉన్న మూల మలుపులో నిత్యం ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నారు.శనివారం,ఆదివారం రెండు రోజుల్లో వరుసగా నాలుగు మంది ద్విచక్రవాహనదారులు ఇసుక, కంకర రోడ్డుపైన పడిన విషయాన్ని గమనించకపోవడంతో కింద పడిపోయారు.గమనించిన వాహనదారులు వారిని లేపి పక్కన కూర్చోబెట్టి నీరు తాగించి సపర్యలు చేసారు.అసలే ఇది మూల మలుపు కావడం,బేగంపేట నుంచి ఫతేనగర్ వెళ్లే వాహనదారులు ప్రయాణిస్తున్న సమయంలో ఫుట్‌ఫాత్‌పై నిల్వచేసిన ఇసుక,కంకర ఆటోలలో నింపుతున్న సమయంలో రోడ్డుపైన పడిపోతుండటంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.ప్రతి రోజు ఇదే ప్రాంతంలో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.గతంలో కూడా ఈ ప్రాంతంలో కార్లు ఢీ కొన్న ఘటనలు కూడా ఉన్నాయి.ఈ ప్రమాదంలో ఒక కుటంబానికి చెందిన వారు గాయాల పాలయ్యారు.దీనికి తోడు ఈ ప్రాంతంలో లైట్లు కూడా లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు,పోలీసులు జోక్యం చేసుకుని ఫుట్‌ఫాత్‌లు ఆక్రమించి ఇసుక,కంకర, ఇటుక వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని,వెంటనే వాటిని తొలగించాలని స్థానికులు,పాదచారులు ,వాహనదారులు కోరుతున్నారు.

ఫతేనగర్ రోడ్డులో సబ్‌స్టేషన్ ముందు ఫుట్‌ఫాత్ ఆక్రమించి ఇసుక,కంకర,డస్ట్ నిల్వచేసిన దృశ్యం.

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలు అమలు చేయాలి

-ప్రారంభమైన సిఐటియు జిల్లా నాలుగవ మహాసభలు

అత్తాపూర్ నవంబరు 10, ప్రభాతవార్త :

సిఐటియు రంగారెడ్డి జిల్లా నాలుగవ మహాసభలు సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎన్ రాజు అధ్యక్షతన సోమవారం కాటేదాన్ చౌరస్తాలో గుంటి యాదయ్య ఎల్.ఎల్.బి ప్రాంగణంలో ప్రారంభమైయ్యాయి.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య , రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్‌లు హాజరై మాట్లాడుతూ ...గుంటి యాదయ్య అడ్వకేట్ వృత్తిలో ఉండి గగన్ పహాడు పారిశ్రామిక ప్రాంతంలో కార్మికుల అండగా ఉంటూ కార్మికులకు హక్కుల వివరాలు తెలుపుతూ పోరాటాలకు మద్దతు తనుచివరి వరకు కార్మికుల పక్షపాతిగా ఉండి ఈ మధ్యకాలంలోనే అమరులయ్యారు రంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా పారిశ్రామిక క్లస్టర్ ఉన్నాయి అందులో పని చేస్తున్నటువంటి కార్మిక వర్గాన్ని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను అమలు చేయకుండా కార్మికులతో శ్రమదోపిడి చేసుకుంటూ కార్మిక హక్కులను అమలు చేయట్లేదు పరిశ్రమలలో ఆ పరిశ్రమలలో కార్మికుల చట్టాల ఆధారంగా కార్మికులకు వేతనాలు ఇతర బెనిఫిట్స్ కల్పించాలి. తెలంగాణలో హైదరాబాదు సెంటర్ గా ఉంటున్న దేశంలోనే పేరుగాంచిన హైదరాబాద్‌కు అనేకమంది వలస కార్మికులు వచ్చి ఇక్కడ తమ కుటుంబాల పోషణ కోసం పనిచేసుకుంటున్నారు వలస కార్మికులకు 1979 అంతర్రాష్ట్ర వలస కార్మిక చట్టాన్ని అమలు కానివ్వట్లేదు వలస కార్మికుల జీవితాలు మారాలంటే వారందరికీ వలస కార్మిక చట్టాలు ఆధారంగా అమలు చేయాలి అనేక సంవత్సరాలు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలని కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం 29 కార్మిక చట్టాలనే రద్దుచేసి కార్పొరేట్ పెట్టుబడి ధరలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్స్ అమలు చేస్తూ కార్మికుల పొట్టలు కొడుతుంది ఆ లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలి మున్సిపాలిటీ కార్మికులు రోజువారి పనులు చేస్తూ ప్రభుత్వాలు మారిన వారి వేతనం పెంచకుండా కాలయాపన చేస్తూ వాళ్ళు అనేక రోగాల బారిన పడిన వారికి ఎలాంటి ఇన్సూరెన్స్ లేకపోవడం దుర్మార్గం వారందరికీ ఇన్సూరెన్స్ మరియు పర్మనెంట్ 10 లక్షలు.కనీస వేతనం 26,000 సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అమలు చేయాలి అన్ని రంగాల కార్మికులకు ఈఎస్ఐ. ఉద్యోగ భద్రత. తదితర అంశాలన్నీ పరిష్కరించాలి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరికలు చేస్తూ సమస్యల పరిష్కారం కోసం మనమందరం ముందుండి పోరాడాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం చంద్రమోహన్ గారు. కోశాధికారి జి కవిత. ఉపాధ్యక్షులు. జాజాల రుద్ర కుమార్. అల్లి దేవేందర్. కీసరి నర్సి రెడ్డి.జగదీష్. కిషన్. బిసా సాయిబాబు. సహాయ కార్యదర్శిలు. బ్రహ్మయ్య. ఎస్ రామ్మోహన్ రావు. స్వప్న. వీరయ్య. సునీత. . జిల్లా కమిటీ సభ్యులు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు సభానంతరం కాటేదాన్ చౌరస్తా నుండి పరిశ్రమల మీదుగా భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ మండల పరిధిలో ఉన్నటువంటి ఐదు డివిజన్ల కన్వీనర్లు వి.సి.కే భాస్కర్. చుక్క మోహన్. బచ్చల కూర స్వామి. కాలే రాజు. బి వెంకటయ్య ఐదు మంది కన్వీనర్లు పాల్గొన్నారు.

ప్రతి రోజు ప్రమాదాలు....

-ఫ్లై ఓవర్ పై నిల్చిపోతున్న ట్రాఫిక్.

బేగంపేట నవంబరు 10,ప్రభాతవార్త

బేగంపేట ఫ్లై ఓవర్ పై వేగంగా ప్రయాణిస్తున్నారు.ఒకరి కొకరు ఢీ కొంటున్నారు.దీంతో నిత్యం బేగంపేట ఫ్లై ఓవర్ పైన ట్రాఫిక్ జాం అవుతుంది.గ్రీన్‌ల్యాండ్స్ నుంచి ప్రారంభమైన ఈ ఫ్లై ఓవర్ బేగంపేట లోని శ్రీకట్టమైసమ్మ మహాలక్ష్మి అమ్మ వారి ఆలయం ముందు కిందికి దిగుతుంది.ఇదే ప్రాంతంలో ఫతేనగర్ కు వెళ్లే వాహనాలు,అటు బాలానగర్,బల్కంపేట నుంచి వచ్చే వాహనాలు,ఇంకో వైపు బేగంపేట బస్తీల నుంచి వచ్చే వాహనాలు ఈ ఫ్లై ఓవర్ కిందే కలుస్తాయి.అయితే గ్రీన్‌ల్యాండ్స్ వైపు నుంచి బేగంపేట ఫ్లై ఓవర్ పైన ప్రయాణించే వాహనాలు అదే ఫ్లై ఓవర్ పైన కిందికి దిగుతున్న క్రమంలో తరచూ ఒక దానికి ఒకటి ఢీ కొంటున్నాయి.పై నుంచి వేగంగా వచ్చిన వాహనాలు ఫ్లై ఓవర్ దిగే ప్రాంతంలో కింద నుంచి వస్తున్న వాహనాలను గమనించి కొంత స్లో అవుతుంటాయి.ఈ క్రమంలో వారి వెనుక వచ్చే వారు ఆ వాహనాలను వెనుక నుంచి ఢీకొడుతుండటంతో తరచూ వివాదాలు చోటు చేసుకుంటున్నాయి.వాహనాలు ఢీకొన్న వెంటనే ఇరువురు వాహనదారులు ఫ్లై ఓవర్ పైనే తమ వాహనాలను నిలిపి వాగ్వివాదాలకు దిగుతుండటంతో వెనుక వచ్చే వాహనదారులు నిలిపివేస్తుండటంతో తరచూ ట్రాఫిక్ జాం అవుతుంది.దీంతో ప్రతి రోజు ఈ ఫ్లై ఓవర్ వివాదాలకు కేంద్రంగా మారుతుంది.వాహనదారులు ఎలా ప్రయాణించాలి అన్న సూచిక బోర్డులు ఈ ఫ్లై ఓవర్ పైన ఏర్పాటు చేయకపోవడంతో కూడా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని,వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని వ

మంత్రి అజాహరుద్దీన్‌కు మైనార్టీ శాఖను కేటాయించడం అభినందనీయం: షేక్ అక్బర్

మంత్రి అజాహరుద్దీన్ ను కలిసి పుష్ప గుచ్చాలను అందజేసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేస్తున్న మలక్ పేట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ షేక్ అక్బర్ తదితరులు

మలక్ పేట ,నవంబర్ 10, ప్రభాతవార్త: మంత్రి అజహారుద్దీన్ కు మైనార్టీ శాఖను కేటాయించడం అభినందనీయమని మలక్ పేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ షేక్ అక్బర్ పేర్కొన్నారు. మలక్ పేట నుంచి నాయకులు, కార్యకర్తలతో కలిసి షేక్ అక్బర్ సచివాలయానికి తరలివెళ్లి మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అజహరుద్దీన్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చలను అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా షేక్ అక్బర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాఫర్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

రాగన్నగూడ సిఐటియు కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం

రాగన్నగూడలో సిఐటియు కార్యాలయంలో వివిధ రంగాల అధ్యక్ష కార్యదర్శులు ముఖ్య కార్యకర్తల

తుర్కయంజాల్ నవంబర్10, ప్రభాతవార్త) తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడ సిఐటియు కార్యాలయంలో నూతన కన్వినింగ్ కమిటీని 21 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది నూతన కన్వీనర్ గా యం.సత్యనారాయణ ను ఎన్నుకోవడం జరిగింది.ఈ జనరల్ బాడీ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు డి కిషన్ హాజరై మాట్లాడుతూ తుర్కయంజాల్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న వివిధ రంగాల ఉద్యోగ కార్మికులను సంఘటితం చేయాలని, ఐక్య ఉద్యమాలు నిర్మించాలని, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రణాళిక బద్ధంగా పనిచేసి కార్మిక వర్గానికి ఆపన్న హస్తంగా నిలబడాలని, తద్వారా సిఐటియును క్షేత్రస్థాయి వరకు విస్తరింపచేసి సిఐటియు బలోపేతానికి కృషి చేయాలని నూతన కమిటీకి పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బడుగు మాల్యాద్రి, గుర్రం జంగయ్య, కొండిగారి శంకర్, గనిపల్లి రాములు, పగిల్ల మధు, ఏ మాధవరెడ్డి, మహమ్మద్ జాఫర్, నాగం ధర్మారెడ్డి, శ్రీనివాస్, దానయ్య, గోపాల్, ఐతరాజ్ కృష్ణ, నర్సింహా, ప్రేమలత, స్వప్న, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా అభివృద్ధి పనులు - ఎమ్మెల్యే బలాల

జిహెచ్ఎంసి అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

మలక్ పేట ,నవంబరు 10, ప్రభాతవార్త: వేగవంతంగా అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు మలక్ పేట నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. ఓల్డ్ మలక్ పేట డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై జిహెచ్ఎంసి అధికారులు, సిబ్బంది తో ఎమ్మెల్యే అహ్మద్ బలాల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఇ వెంకన్న, సూపర్వైజర్ సత్యనారాయణ, ఓల్డ్ మలక్ పేట డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు సైఫుద్దీన్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా బిజెపి కౌన్సిల్ మెంబర్‌గా రవికుమార్

రవికుమార్‌కు నియామకపు పత్రాన్ని అందజేస్తున్న వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి.

వనస్థలిపురం. నవంబర్.10.ప్రభాతవార్త. రంగారెడ్డి జిల్లా బి.జె.పి.కౌన్సిల్ మెంబర్ గా వనస్థలిపురం డివిజన్ కు చెందిన చిట్టిపోలు రవికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా బి.జె.పి.అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి నియామకపు ఉత్తర్వులు జారీచేసి రవికుమార్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనిచేసే నాయకులకు పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు.తనపై నమ్మకంతో కౌన్సిల్ సభ్యుడు గా నియమించినందులకు శ్రీనివాస్ రెడ్డి కి,సీనియర్ నాయకులు కొత్త రవీందర్ గౌడ్,జక్కిడి ప్రభాకర్ రెడ్డి లకు చిట్టిపోలు కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్ అధ్యక్షుడు కాటం క్రాంతిగౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు నూతి శ్రీనివాస రావు, వీరస్వామి గౌడ్,నాయిని శ్రీకాంత్ రెడ్డి,గంగాపురం రామాంజనేయులు గౌడ్,అరుణ్ జోగి,దాసు,దయాకర్ చారి, ఆది నర్సింహారావు,అనిలకుమార్ గౌడ్, అశోకుమార్, రాజు గౌడ్ తదితరులు చిట్టిపోలు రవికుమార్ కు శుభాకాంక్షలు తెలిపారు.

మళ్ళీ రోడ్డెక్కిన బడంగ్‌పేట్ ఎజిఆర్ కాలనీవాసులు

-డ్రైనేజీ పనులు ప్రారంభం కాకపోవడంపై నిరసన
-అధికారుల జాప్యాన్ని నిరసిస్తూ రోడ్డుపై బైఠాయింపు
-ఇంకెంత కాలం డ్రైనేజీ సమస్యలను భరించాలంటూ ఆగ్రహం

రోడ్డుపై బైఠాయించి ప్ల కార్డులతో ధర్నా చేస్తున్న ఎజిఆర్ కాలనీ అధ్యక్షుడు ప్రమోద్, కాలనీవాసులు

సరూర్‌నగర్, నవంబర్ 10 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 30వ డివిజన్‌కు చెందిన బడంగ్‌పేట్ ఎజిఆర్ కాలనీవాసులు మళ్ళీ రోడ్డెక్కారు. గత ఆరు నెలల నుండి కాలనీ ప్రధాన రోడ్డులో ఇళ్ళ ముందు జీవ నదిలా ప్రవహిస్తున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ఇటీవల రోడ్డుపై బైఠాయించి ధర్నా చేసిన కాలనీవాసులు అప్పట్లో వారం రోజుల్లో డ్రైనేజీ పనులు ప్రారంభిస్తామని అధికారులు ఇచ్చిన హామీతో విరమించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత స్థానిక మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సైతం కాలనీలో పర్యటించి సమస్య శాశ్వత పరిష్కారం కోసం పనులు చేపట్టాలని కమీషనర్‌ను ఆదేశించడం కూడా జరిగింది. అయితే దాదాపు రెండు వారాలు గడుస్తున్నా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఎలాంటి పనులు ప్రారంభించకపోవడం.. కాలనీలో డ్రైనేజీ సమస్యలు యధాతథంగా ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన కాలనీవాసులు మరో సారి ధర్నాకు పూనుకున్నారు. ఈ మేరకు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో బడంగ్‌పేట్ అంబేద్కర్ విగ్రహం సమీపంలోనున్న ప్రధాన రోడ్డులో బైఠాయించి ధర్నా చేసిన కాలనీవాసులు ఆ తర్వాత దావూద్‌ఖాన్ గూడలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కూడా బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు నిధులు మంజూరైనా పనులు చేపట్టడంలో అధికారుల జాప్యాన్ని నిరసిస్తూ ప్ల కార్డులతో ధర్నా చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దాదాపు ఆరు నెలల నుండి ప్రతి రోజూ ఎజిఆర్ కాలనీ రోడ్డు గుండా డ్రైనేజీ ప్రవహిస్తుండడంతో నరకం చవి చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం కాలనీ గుండా వందలాది మంది పాఠశాల విద్యార్థులకు కూడా వెళ్తుంటారనీ అంతే కాకుండా బడంగ్‌పేట్ గ్రామ ప్రధాన స్మశానవాటికకు కూడా ఎజిఆర్ కాలనీ నుండే వెళ్తుంటారనీ ఈ నేపథ్యంలో పొంగి ప్రవహించే మురికి నీటి వల్ల అందరూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు వివరించారు. ఇటీవల ధర్నా చేసిన సందర్భంగా పనులు ప్రారంభిస్తామని హామీనిచ్చిన అధికారులు పక్క కాలనీవారి అభ్యంతరంతో పనులు చేపట్టకం జాప్యం చేస్తుండడం వల్ల తమ సమస్య ఎప్పటిలాగే ఉందని అసహనం వ్యక్తం చేశారు. డ్రైనేజీ సమస్య శాశ్వతంగా పరిష్కారం అయ్యే వరకు పోరాటం చేస్తూనే ఉంటామనీ అవసరమైతే కార్పొరేషన్ కార్యాలయాన్ని దిగ్బంధనం చేస్తామని వారు స్పష్టం చేశారు. కాగా మరో సారి అధికారులు ఆందోళన చేస్తున్న కాలనీవాసులకు నచ్చజెప్పడంతో వారు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో పాటు టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ కాలనీ, లక్ష్మీ దుర్గ, ఎంసిఆర్ కాలనీ అధ్యక్షులు బంగారు బాబు, మూర్తి, అరుణ్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు సురేష్, కాలనీవాసులు రామ్మోహన్‌రెడ్డి, సంతోష్, కృష్ణారెడ్డి, నర్సింహచారి, రామకృష్ణ, శ్రీహరి, కృష్ణారావు, నాయకుడు, చెన్నారావు, జగదీశ్, మహేందర్, జగన్, డేనియల్ తదితరులు పాల్గొన్నారు. కాగా తమ ధర్నాకు స్పందించిన కమీషనర్ సరస్వతి కాలనీలో డ్రైనేజీ పనులు మొదలు పెట్టించారని ఎజిఆర్ కాలనీ అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్ తెలిపారు.

పేద కుటుంబాలకు అండగా కళ్యాణలక్ష్మి , షాదీముబారక్

నేరేడ్ మెట్, నవంబర్ 10 (ప్రభాతవార్త ప్రతినిధి): మల్కాజ్‌గిరి ఎమ్మార్వో కార్యాలయం వద్ద సోమవారం కళ్యాణలక్ష్మి - షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులను స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ...గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆవిష్కరించిన కళ్యాణలక్ష్మి - షాదీ ముబారక్ పథకాలు రాష్ట్రంలో వేలాది పేద కుటుంబాలకు అండగా నిలిచాయి. ఈ పథకాలు సామాజిక సమానత్వానికి, మహిళా సాధికారతకు, ఆర్థిక సహాయానికి ప్రతీకలుగా నిలిచాయి అని అన్నారు. పేద అమ్మాయిల వివాహం భారం తల్లిదండ్రులపై తగ్గించే ఈ పథకాలు ఎంతోమందికి ఉపయోగము అని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాలను కొనసాగిస్తుందనడం ఆనందదాయకం. అయితే ప్రజలకు ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చాలి అని అన్నారు.ముఖ్యంగా చెక్కులతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన సీఎం ఆ హామీని నిలబెట్టుకోవాలని కోరుతున్నాను" అని అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అనంతలక్ష్మి, మల్కాజ్‌గిరి తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, గౌతమ్‌నగర్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, చిన్న యాదవ్, అమీనుద్దీన్, శివ గౌడ్, చిందం శ్రీనివాస్, శంకర్ రావు, శ్రీనివాస్, హేమంత్ పటేల్, శోభ, ఉస్మాన్, మారుతి ప్రసాద్, రాజు, జనార్ధన్, వెంకటేష్, శ్రీనివాస్, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై ఎమ్మెల్యేని ఆత్మీయంగా ఆహ్వానించారు.

అందె శ్రీ భౌతికకాయానికి నివాళులర్పించిన పలువురు ప్రముఖులు

నివాళులర్పిస్తున్న మాజీ మంత్రులు పద్మారావు, తలసాని, హరీష్ రావు,ఎమ్మెల్సీ కవిత తధితరులు

తార్నాక, నవంబర్ 10 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయ హే తెలంగాణ సృష్టికర్త, ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ మరణం తమకు తీవ్ర విచారాన్ని కలిగించిందని నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి పేర్కొన్నారు. లాలాపేట్ ప్రొ.జయశంకర్ స్టేడియంలో సందర్శకుల కోసం ఉంచిన అందె శ్రీ భౌతిక కాయానికి టిటియుసి రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డితో కలిసి సందర్శించి తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.తెలంగాణ ఆత్మ గౌరవాన్ని ప్రతిబింబించిన జయ జయ హే తెలంగాణ గీతం ద్వారా అందెశ్రీ ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచారని వారు పేర్కొన్నారు. 2001 సంవత్సరం నుంచి తెలంగాణ ఉద్యమంలో అందెశ్రీతో తాము తార్నాక ప్రాంతంలో తెలంగాణ సాధన కోసం అనేక సార్లు ఉద్యమాల్లో పాల్గొన్నారని గుర్తు చేశారు. తెలంగాణ స్ఫూర్తికి ప్రతీ కగా నిలిచారని వారు గుర్తుచేశారు.అందెశ్రీ కుటుంబ సభ్యులకు, అభిమానులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. భౌతిక కాయానికి నివాళులర్పించిన మాజీ మంత్రులు హరీష్ రావు, తలసాని, పద్మారావు,ఎమ్మెల్సీ కవిత ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ మరణ వార్త విన్నవెంటనే లాలాపేట్‌కు చేరుకున్న మాజీ మంత్రులు హరీష్ రావు, తలసాని, పద్మారావు గౌడ్, ఎమ్మెల్సీ కవిత ఆయన భౌతిక కాయా నికి ఘనంగా నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అందెశ్రీకి వారికి ఉన్న సంభందాన్ని గుర్తు చేసుకున్నారు.

జనన, మరణ సర్టిఫికెట్ జారీ చేయడంలో జాప్యం పట్ల కార్పొరేటర్ ఆగ్రహం

కార్యాలయం నేలపై బైఠాయించి నిరసన

నేలపై పూసుకొని నిదర్శనం వ్యక్తం చేస్తున్న పవన్ కుమార్

ఎల్.బి.నగర్, నవంబర్ 10 ప్రభాతవార్త: జనన, మరణ ధృవీకరణ సర్టిఫికెట్ జారీ చేయడంలో జాప్యం ఎందుకు చేస్తున్నారని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సరూర్నగర్ సర్కిల్ కార్యాలయంలో కార్పొరేటర్ నాయకోటి పవన్‌కుమార్ జనన, మరణ ధృవీకరణ సర్టిఫికెట్ ఇచ్చే ప్రక్రియలో జరుగుతున్న ఆలస్యంపై నిరసన వ్యక్తం చేస్తూ సోమవారం కార్యాలయం నేలపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్టిఫికెట్లు జారీ చేయడంలో అలసత్వంగా వ్యవహరిస్తున్న అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఇప్పటికే తమ కుటుంబ సభ్యులను కోల్పోయిన బాధలో ఉండగా, డెత్ సర్టిఫికేట్ కోసం రోజులు, వారాలు తిరగాల్సి రావడం చాలా అన్యాయం అన్నారు. ప్రజలకు త్వరితగతిన సేవలు అందించాల్సిన ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్లక్ష్యం వహించడం సరైంది కాదన్నారు. ఫైల్స్ ఉద్దేశపూర్వకంగా నిలిపి చేయడం వంటి వ్యవహారాలు వెంటనే ఆపాలని కఠినంగా హెచ్చరించారు. డెత్ సర్టిఫికేట్ ప్రజలకు అత్యవసరమైనదనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. పెన్షన్, ఇన్సూరెన్స్, లీగల్ ప్రక్రియలు, బ్యాంక్ సెటిల్‌మెంట్స్ వంటి పనులు అవి లేకుండా ముందుకు సాగవన్నారు. అందువల్ల ప్రతి కేసును అత్యంత ప్రాధాన్యంతో వెంటనే జారీ చేయాలని అధికారులు, సిబ్బందిని కోరారు.ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎవరైనా సిబ్బంది ఉంటే, వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకువస్తామని అన్నారు.

బడంగ్‌పేట్ కాశీబుగ్గలో ఘనంగా బ్రాహ్మణ కార్తీక వన సమారాధన

కార్తీక వన సమారాధాన కార్యక్రమంలో ఉపన్యసిస్తున్న ఎమ్మెల్సీ సురభి వాణిదేవి: చిత్రంలో బడంగ్‌పేట్ నగర బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు మంగు రాఘవరావు తదితరులు

సరూర్‌నగర్, నవంబర్ 10 ప్రభాతవార్త: బాలాపూర్ మండలంలోని బడంగ్‌పేట్‌లోనున్న పురాతనమైన కాశీబుగ్గ శ్రీ పద్మావతి అలివేలు మంగా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం కార్తీక వన సమారాధన ఘనంగా జరిగింది. బడంగ్‌పేట్ నగర బ్రాహ్మణ సేవా సంఘ ఆధ్వర్యంలో అధ్యక్షుడు మంగు రాఘవరావు తదితరుల నిర్వహణలో ఈ కార్యక్రమాన్ని సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆరు గంటల నుండి మహా రుద్రాభిషేకాలు, ఆ తర్వాత జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహించి గోపూజ, ఉసిరి చెట్టుకు పూజాదికాలు జరిపారు. మహిళలు సామూహిక లలితా విష్ణు పారాయణం చేశారు. కాగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్వర్గీయ మాజీ ప్రధాని పివి నర్సింహారావు తనయ, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి హాజరై ఉపన్యసించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్తీక వన సమారాధనలతో ఐక్యతాభావం పెంపొందుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా తెలంగాణ బ్రాహ్మణ సంఘం సమాఖ్య అధ్యక్షుడు మోత్కూరి రామేశ్వరరావు, ఆత్మీయ అతిథులుగా బ్రాహ్మణ ముఖ్యులు చింతపల్లి మంగపతిరావు, తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య ఛైర్మన్ వెన్నంపల్లి జగన్మోహన్‌శర్మ, విశ్రాంత న్యాయమూర్తి జానకి రామారావు, జిల్లా బ్రాహ్మణ సంఘం నాయకులు, పెద్దలతో పాటు కార్యక్రమ సహ నిర్వాహకులైన బడంగ్‌పేట్ నగర బ్రాహ్మణ సంఘం గౌరవాధ్యక్షులు తుంగతుర్తి మోహన్‌రావు, చక్రవర్తుల మదన్మోహనాచార్యులు, అనూరాధ, కోశాధికారి రాంబాబు, ఉపాధ్యక్షులు వేముల కవిత, నవీన్‌కుమార్, మైథిలి, మాధురి, మహిళాధ్యక్షురాలు సుధారాణి, బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు రాంభట్ల అఖిల్, నరేందర్, మంత్రాల శ్రీరామమూర్తి, జనగామ శంకర్‌రావు, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శివతత్వాన్ని పెంపొందించుకోవాలి : మధుసూదనాచారి

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎం.ఎల్.సి.మధుసూదనాచారి, సతీష్ గౌడ్.

వనస్థలిపురం. నవంబర్.10.ప్రభాతవార్త. ప్రతి ఒక్కరు శివతత్వాన్ని పెంపొందించుకుని,ప్రశాంత వాతావరణంలో జీవనం గడపాలని తెలంగాణ శాసనమండలి సభ్యుడు మధుసూదనాచారి పేర్కొన్నారు. బి.యన్.రెడ్డి.నగర్ డివిజన్ లోని శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రీ మల్లికార్జున భక్త సమాజం అధ్యక్షుడు ముద్దగౌని సతీష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యమానికి సోమవారం ముఖ్య అతిథిగా పాల్గొని శివస్వాముల కు అన్న ప్రసాద వితరణ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం శివదీక్ష ను తీసుకుని, సన్నిధానం ఏర్పాటు చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సతీష్ గౌడ్ చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్. రాష్ట్ర నాయకులు శివ ప్రకాష్,సాయినాథ్ రాజ్,సందీప్, సుబ్బు,పవన్,కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా కాలనీల అభివృద్ధి

నాగార్జున కాలనీలో సి.సి.రోడ్డు నిర్మాణపు పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రాగుల.

వనస్థలిపురం నవంబర్.10.ప్రభాతవార్త : రాజకీయాలకు అతీతంగా అన్ని కాలనీలలో అభివృద్ధి పనులు చేపడతామని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర రెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని నాగార్జున కాలనీలో రూ.16 లక్షల వ్యయం తో నిర్మించనున్న సి.సి.రోడ్డు నిర్మాణపు పనులకు సోమవారం కాలనీ కమిటీ ప్రతినిధులతో కలిసి శంఖుస్థాపన చేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడతామన్నారు.ప్రజలకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకు వస్తే ,పరిస్కారాని కృషి చేస్తామన్నారు. ఎక్కడా లేని విధంగా డివిజన్ లో కోట్లాది రూపాయల తో అభివృద్ధి పనులు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీల అధ్యక్షులు నాయకులు పాల్గొన్నారు.

మాధవనగర్ కాలనీ అధ్యక్షుడిగా గోపాల్ ముదిరాజ్

నూతన అధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్‌ను అభినందిస్తున్న కాలనీవాసులు

సైదాబాద్, నవంబరు 10 ప్రభాతవార్త: చంపాపేట డివిజన్ మాధవనగర్ కాలనీ అధ్యక్షుడిగా గోపాల్ ముదిరాజ్ విజయం సాధించారు. బ్యాలెట్ పద్ధతిలో జరిగిన ఎన్నికల్లో అనసూయపై గోపాల్ ముదిరాజ్ గెలుపొందారు. ఈ సందర్భంగా గోపాల్ ముదిరాజ్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీల సహకారంతో కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రణీత్, చిన్న కృష్ణారెడ్డి, లక్ష్మణ్ యాదవ్, ముత్యాల పుష్పమ్మ, గోగిరెడ్డి అంజిరెడ్డి, మద్ది కరుణాకర్‌రెడ్డి, ఎం.వెంకట్‌రెడ్డి, కసిరెడ్డి శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులపై దాడులు హేయం : కార్పొరేటర్

పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

సైదాబాద్, నవంబరు 10 ప్రభవార్త: సూర్యుడి కంటే ముందే విధుల్లో నిమగ్నమై నగరాన్ని శుభ్రంగా ఉంచే పారిశుధ్య కార్మికులపై దాడులు చేయడం హేయమైన చర్య అని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. బి బ్లాక్ క్వార్టర్స్‌లో రోడ్లను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు, సూపర్‌వైజర్‌పై కొందరు యువకులు దాడి చేయడంతో గాయాలపాలైన వారిని పరామర్శించిన అనంతరం కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులపై దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు.

ఆధునిక సాంకేతిక విధానాలతో రోగులకు మరింత ఉత్తమ సేవలు : డాక్టర్ బాలరాజు నాయుడు

సైదాబాద్, నవంబరు 10 ప్రభాతవార్త: వైద్య రంగంలో ఆధునిక సాంకేతిక విధానాలు రోగులకు మరింత ఉత్తమ సేవలు అందించడానికి తోడ్పడుతాయని ఓనస్ ఆసుపత్రి ఎండి డాక్టర్ బాలరాజు నాయుడు అన్నారు. హార్వర్డ్ మెడికల్ స్కూల్ హెల్త్ కేర్ ఈ మరీస్ ప్రోగ్రామ్‌ను డాక్టర్ బాలరాజు నాయుడు విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా చంపాపేటలోని ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో ఆయనను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలరాజు నాయుడు మాట్లాడుతూ లీడింగ్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఇన్ హెల్త్ కేర్ కోర్సును పూర్తి చేయడం జరిగిందని, ఈ కోర్సు వైద్య రంగంలో మరిన్ని సేవలు అందించడానికి తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగుగుట్ట ఆలయంలో ఘనంగా శివపార్వతుల కళ్యాణోత్సవం

ఉప్పల్ వెలుగుగుట్ట శ్రీ మల్లికార్జునస్వామి ఆలయంలో శివపార్వతుల కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న ఈవో పి.శ్రీకాంత్, మల్లేష్ తదితరులు

ఉప్పల్, నవంబరు 10 ప్రభాతవార్త : ఉప్పల్ వెలుగుగుట్టలో కొలువుదీరిన శ్రీ మల్లిఖార్జున స్వామి దేవాలయంలో కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా శ్రీ శివపార్వతుల కళ్యాణోత్సం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి పెద్దిగారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ఆలయ కమిటి నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఉదయం శ్రీ మల్లికార్జునస్వామి వారికి ఏకవార రుద్రాభిషేకం, అనంతరం శివపార్వతుల కళ్యాణోత్సవం నిర్వహించారు.గర్భాలయంలో సామూహిక రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం మహా న్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, వాయులింగం, పూజలు నిర్వహించారు. కార్తీక సోమవారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్తీక మాసం ఉత్సవాల సందర్భంగా స్వామి వారి ఆలయాన్ని సర్వంగా సుందరంగా ముస్తాబు చేశారు. ఉత్సవాలకు వివి